

పునరుద్ధరణ పనులు ముమ్మరం
భారీ వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు తెలిపారు.
- 8లో▸



సర్వస్వం పోయింది.. ఆదుకోండి
మోరంచపల్లి గ్రామస్తులు వరద ఉధృతిలో సర్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0°/24.0°

వాతావరణం
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పర్యావరణ సమతుల్యతను కాపాడాలి



న్యూశాయంపేట : పర్యావరణ సమతుల్యతను కాపాడాలని వరంగల్, భద్రాద్రి జోన్ ముఖ్య అటవీ సంరక్షణ అధికారి డి.భీమా సూచించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జూపార్కులో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అడవిలో పులి ఉన్నప్పుడే పర్యావరణ సమతుల్యత ఉంటుందని వివరించారు. అదేవిధంగా సంవత్సర కాలంలో జూపార్కులో సందర్శకులకు పులి కనిపించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భద్రాద్రి జోన్‌లో పులి వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకునే విధంగా అటవీశాఖ చర్యలు తీసుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి జె.వసంత, రిటైర్డ్ డీఎఫ్ఓ పురుషోత్తం, రిటైర్డ్ ఎఫ్‌డీఓఎస్ సత్యనారాయణ, జూపార్కు ఇన్‌చార్జ్ రేంజ్ ఆఫీసర్ విలాసాగరపు రాజు, దేవాచారి, సారయ్య, వీరభద్రరావు, నరేశ్, వేణు, శ్రీనివాస్‌పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయ ప్రధానార్చకుడిగా ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ అర్చక ఉద్యోగ జేసీ చైర్మన్, శ్రీరుద్రేశ్వరస్వామి వేయి స్తంభాల దేవాలయ ఉపప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మను ప్రధానార్చకుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఆలయ ఆదాయాన్ని అనుసరించి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, రీజినల్ కమిషనర్ ఎం.రామకృష్ణారావు ఆదేశాల మేరకు ఉపేంద్రశర్మకు ఆలయ ఈఓ కె.వెంకయ్య శనివారం ఉత్తర్వుల కాపీని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ గంగు ఉపేంద్రశర్మ ఆగమశాస్త్రం ప్రకారం పూజాకార్యక్రమాలను నిర్వహిస్తూ, రుద్రేశ్వర ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : డీఈఓ



విద్యారణ్యపురి : విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై హెచ్చరించారు. హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో జిల్లాలోని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, అన్ని సబ్జెక్టుల సీఆర్టీలతో ఈ ఏడాది వచ్చిన టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలపై శనివారం సమీక్షించారు. విద్యార్థినుల హాజరు, నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించి ఆయన మాట్లాడారు. గత ఏడాది కేజీబీ వీల్లో టెన్త్, ఇంటర్‌లో తక్కువ ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, జీసీడీఈఓ సునీత, జిల్లాలోని 9 కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్టీలు పాల్గొన్నారు.

ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌పై సీపీకి ఫిర్యాదు



హన్మకొండ : ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌పై సీపీ ఏవీ.రంగనాథ్‌కు బీజేపీ నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. భద్రకాళి చెరువు వద్దకు చేరుకున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి, నాయకులను అడ్డుకోవడంతోపాటు కార్యకర్తలపై ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ దాడి చేశారని, పోలీస్ వాహనంలో ఎక్కించుకుని తీవ్రంగా కొట్టారని ఆరోపించారు. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లిన తమపై అకారణంగా దాడి చేసిన ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు దాడి చేసి తీవ్రంగా కొట్టడాన్ని పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఖండించారు.

పలువురు ఏసీపీల బదిలీ

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. డి.రమణబాబు వెయిటింగ్ నుంచి ఏసీపీ వరంగల్ సీటీసీకి, పి.సాంబయ్య సీటీసీ వరంగల్ నుంచి సీసీఎస్ సిద్దిపేట, ఎం.జితేందర్ రెడ్డి వరంగల్ టాస్క్‌ఫోర్స్ నుంచి సీఎస్‌బీ వరంగల్, ఎల్.రమేష్‌కుమార్ వెయిటింగ్ ఎస్‌బీ నుంచి సెక్యూరిటీ వింగ్ వరంగల్, భోజరాజు ఏసీపీ సెక్యూరిటీ వింగ్ వరంగల్ నుంచి ట్రాఫిక్ వరంగల్, ఎ.మధుసూదన్ ట్రాఫిక్ వరంగల్ నుంచి టాస్క్‌ఫోర్స్ వరంగల్‌కు బదిలీ అయ్యారు.

621 ఎకరాల్లో | 41 కబ్జా

భద్రకాళీ.. భరోసా ఏది?

- ఆక్రమణలతోనే చెరువు కట్టకు గండి
- శిఖం భూములు కూడా అన్యాక్రాంతం
- పెట్రేగిపోతున్న ల్యాండ్ మాఫియా
- ముంపునకు కబ్జాలే ప్రధాన కారణం

నగర పరిధిలోని చెరువు శిఖాలు, నాలాలు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడం వల్ల వరంగల్ నగరం వరద ముంపునకు గురవుతోంది. భద్రకాళి బండ్‌ను కూడా వందలాది మంది ఆక్రమించుకుని కట్టడాలు నిర్మించడం వల్ల వరద ఎటూవెళ్లలేక కాలనీల్లోకి వస్తుంది.

– శుక్రవారం నగర పర్యటనలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేసిన వ్యాఖ్యలు

నగరం ప్రతి ఏడాది వరద ముంపునకు గురికావడానికి ప్రధాన కారణం ఆక్రమణలేనని సాక్షాత్తు మంత్రే ప్రకటించడం చూస్తుంటే నగరంలో ఏ రీతిలో కబ్జాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అందులోనూ నగరం నడిబొడ్డున ఉన్న భద్రకాళి చెరువు.. చుట్టూ ఆక్రమణలతో కుచించుకుపోవడంతో వరదధాటికి శనివారం గండిపడింది.

సాక్షి ప్రతినిధి, వరంగల్ :

వరంగల్ మహానగరంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదు. కాకతీయుల గొలుసుకట్టు చెరువులు కొన్ని మాయమైపోగా.. ఉన్న చెరువుల్లో కాలనీలు వెలుస్తున్నాయి. రాజకీయ అండ, అడ్డుకోవాల్సిన అన్ని విభాగాల అధికారుల మద్దతుతో ల్యాండ్ మాఫియా పెట్రేగిపోతోంది. భద్రకాళి లాంటి చారిత్రక, పర్యాటక చెరువు కూడా కబ్జాదారుల బారిన పడింది. చివరకు కబ్జాలే గండికి ప్రధాన కారణం కాగా.. త్రుటిలో తప్పిన పెను ప్రమాదంతో మహానగరం ఒక్కసారి ఉలిక్కిపడింది.

సుప్రీంకోర్టు ఆదేశించినా ఆగని ఆక్రమణలు..
భద్రకాళి చెరువు వరంగల్, హనుమకొండ పట్టణాల మధ్య పశ్చిమ, దక్షిణ దిశగా వ్యాపించి ఉంది. ఈ చెరువును హృదయ్ పథకం కింద సుందరీకరించడంతో పర్యాటక ప్రాంతంగా మారింది. హైదరాబాద్‌లోని ట్యాంకుబండ్‌లాగా భద్రకాళి బండ్ నగరవాసులకు ఆహ్లాదం పంచుతోంది. దీంతో చెరువు కట్ట కింద ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములకు డిమాండ్ పెరిగి ఆక్రమణకు గురవుతోంది. 2014లో సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం భద్రకాళి చెరువు చుట్టూ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)ను వరంగల్ నగరపాలక సంస్థ ఖరారు చేసింది. హనుమకొండలోని పద్మాక్షి రోడ్డు, గాయత్రి కాలనీ, సాయినగర్, సంతోషిమాత కాలనీ, ఎన్టీఆర్‌నగర్, రామన్నపేట రోడ్డు, పోతననగర్, కేఎంసీ పార్కుల వద్ద క్షేత్రస్థాయిలో ఎఫ్‌టీఎల్‌కు మార్కింగ్ చేస్తూ దిమ్మెలను ఏర్పాటు చేశారు. ఈ స్థలాల అమ్మకం, కొనుగోళ్లపై ఆంక్షలు విధించింది. రిజిస్ట్రేషన్లు చేయొద్దని జిల్లా రిజిస్ట్రార్‌ను అప్పటి నగరపాలక సంస్థ కమిషనర్, పాలకవర్గం కౌన్సిల్ సమావేశంలో కోరారు. కానీ, ఆ దిశగా కనీసం చర్యలు కూడా తీసుకోలేదు. సుప్రీంకోర్టు ఆదేశించినా భద్రకాళి చెరువు శిఖం భూమిని ఆక్రమిస్తూ, నగర పాలక సంస్థ అనుమతుల్లేకుండానే రాత్రికి రాత్రే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

41 ఎకరాలు ఆక్రమణ..
1936 రెవెన్యూ, ఇరిగేషన్ రికార్డుల ప్రకారం భద్రకాళి చెరువు విస్తీర్ణం 621 ఎకరాలు. ఇందులో సుమారు 41 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు తేలింది. ఈ నేపథ్యంలో భద్రకాళి చెరువు శిఖం భూములను కాపాడాలని నగరానికి చెందిన పలువురు పౌరులు, ప్రజాసంఘాల నాయకులు హైకోర్టు వరకు వెళ్లి ఫిర్యాదులో అభ్యర్థించారు. ఫిర్యాదు స్వీకరించిన లోకాయుక్త ఆదేశాల మేరకు భద్రకాళి చెరువు శిఖం భూములను సర్వే చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు 2021 సెప్టెంబర్ 30న ఆర్డీఓ, సర్వే, ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. చెరువు నలుమూలలా సుమారు 41 ఎకరాల మేరకు ఆక్రమణకు గురైనట్లు ప్రాథమికంగా తేలింది. ఏ కారణం చేతనో అధికారిక నివేదిక ఇవ్వలేదు, హద్దు రాళ్లు పాతలేదు.



వరంగల్ భద్రకాళి చెరువుకు పోతననగర్ వైపు పడిన గండి (వృత్తంలో) గండి పడిన ప్రదేశం

ఆక్రమణలే ఈ దుస్థితికి కారణం
పద్మాక్షి అమ్మవారి ఆలయం నుంచి శాయంపేట రోడ్డు వరకు ఎడమ వైపు రెండు కాలనీలు అక్రమంగా వెలిశాయి. శాయంపేట రోడ్డు నుంచి పోతననగర్ 12 మోరీల వరకు ఎడమవైపు 22 ఎకరాల వరకు కబ్జా చేసి భవనాలు, అపార్టుమెంట్లు నిర్మించారు. 2014 వరకు రికార్డుల్లో వ్యవసాయ భూమిగా నమోదైంది. కానీ, చెరువులోని నిర్మాణాలకు ఇంటి నంబర్లు ఎలా వచ్చాయో తెలియదు. ఇప్పటికైనా ప్రభుత్వం భద్రకాళి చెరువుతో పాటు ఆక్రమణలకు గురైన గొలుసుకట్టు చెరువుల సర్వే చేయించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే భవిష్యత్‌లో ఆక్రమణలు పెరిగి, వానొస్తే నగరం మరింత ముంపులో కూరుకుపోతోంది.
–సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు, వినియోగదారుల మండలి



కొనసాగుతున్న గండి పూడ్చివేత పనులు



గండిని పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా, చీఫ్‌విప్ వినయ్



ముంపునకు గురవుతుందని అధికారుల సూచన మేరకు ఇళ్లను ఖాళీ చేస్తున్న పోతననగర్ వాసులు

పోతననగర్ వైపు కోతకు గురైన కట్ట

- పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు
- పునరావాస కేంద్రాలకు సమీప కాలనీల ప్రజలు
- తప్పిన ఆస్తి, ప్రాణనష్టం



గండిని పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, సీపీ



ఇళ్లను ఖాళీ చేస్తున్న పోతననగర్‌వాసులు

రామన్నపేట/వరంగల్ క్రైం : భారీ వర్షాల నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న నగర ప్రజలు శనివారం భద్రకాళి చెరువుకు గండి పడడంతో ఆందోళనకు గురయ్యారు. పోతననగర్ వైపు కట్ట తెగిపోవడంతో పోతననగర్, సరస్వతీనగర్, కాపువాడ, అలంకార్ జంక్షన్ ప్రాంతాలను నీరు చుట్టుముట్టింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు భద్రకాళి చెరువును సందర్శించారు. కట్ట మరమ్మతు పనులు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు ములుగు రోడ్డు వైపు ఎలాంటి వాహనాలు రాకుండా బారికేడ్లు పెట్టి కేఎంసీ, హనుమకొండ చౌరస్తా నుంచి వాహనాలను దారి మళ్లించారు. ముంపు ప్రాంతాల ప్రజలను యుద్ధప్రాతిపదికన పునరావాస కేంద్రాలకు తరలించారు.

డ్రెయినేజీ నుంచి కింది ప్రాంతాలకు నీరు..
ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో భద్రకాళి చెరువుకు వరద పోటెత్తింది. పోతననగర్ వైపు చేపట్టిన కాల్వ పనులు నిలిపివేశారు. ఈక్రమంలో వర్షాలతో ఆ ప్రాంతంలోని కట్ట వైపు వరద నీరు భారీగా చేరింది. దీంతో శనివారం ఉదయం ఒక్కసారిగా చెరువు కట్ట తెగిపోయింది. గండిపడిన ప్రదేశం నుంచి నీరు పక్కనే ఉన్న డ్రెయినేజీ ద్వారా కింది ప్రాంతాలకు ప్రవహించింది.

పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
భద్రకాళి చెరువు గండిని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజుయాదవ్, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తాపట్నాయక్, పోలీసు కమిషనర్ రంగనాథ్, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు కట్ట మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. ముంపు ప్రాంత ప్రజలను ముందు జాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వివరించారు. ఫైర్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో మూడు రోజులుగా లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. భద్రకాళి చెరువు చుట్టూ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మిస్తామని తెలిపారు. అధిక వర్షాల కారణంగానే కట్ట తెగిందని వివరించారు.

ఎలాంటి ప్రమాదం లేదు : సీపీ రంగనాథ్
భద్రకాళి చెరువు గండితో దిగువన ఉన్న కాలనీలకు ఎలాంటి ప్రమాదం లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ పేర్కొన్నారు. చెరువు గండిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే సమీప కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వరద ఉధృతిని తగ్గించేందుకు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటిని దారి మళ్లిస్తున్నట్లు వివరించారు. చెరువు పరిసర ప్రాంతాలను పోలీసులు పర్యవేక్షిస్తున్నారని, డ్రోన్‌ల ద్వారా కూడా కలెక్టర్ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సెలవులు రద్దు సరే..

- వీటికి బదులు ప్రయోజనం ఏమిటి..?
- భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో శని, ఆదివారాల్లో పని దినాలు
- ప్రొవిన్షియల్ స్టాఫ్‌కు సెలవులు రద్దుపై విస్మయం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

హన్మకొండ : భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించడానికి టీఎస్ ఎన్పీడీసీఎల్ శని, ఆదివారాల్లో సెలవులు రద్దు చేసింది. రద్దు చేసిన యాజమాన్యం పనిచేసిన రోజుకు ఎలాంటి ప్రయోజనం కల్పిస్తుందో చెప్పలేదని విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు తెలిపారు. సాధారణంగా జనరల్ హాలిడేస్‌లో పనిచేసే ఉద్యోగులకు చేసిన రోజులకు రెట్టింపు వేతనం కట్టించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ప్రత్యేక సెలవుల రద్దుతో ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తారనేది యాజమాన్యం స్పష్టం చేయకపోవడంపై ఉద్యోగ సంఘాలు అభ్యంతరం తెలుపుతున్నాయి. భారీ వర్షాలు, వరదకు పాడైన విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించడంలో ఆపరేషన్, మెయింటెనెన్స్ ఉద్యోగుల పాత్ర కీలకం. వీరికి సెలవులు రద్దు చేయడం సమంజసం. అయితే కార్యాలయంలో పనిచేసే ప్రొవిన్షియల్ స్టాఫ్‌కు సెలవులు రద్దు చేయడంలో ఆంతర్యమేమిటని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణలో ప్రొవిన్షియల్ స్టాఫ్‌కు ఎలాంటి సంబంధం ఉండదని, వీరికి సెలవులు రద్దు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఈ సెలవులకు బదులుగా మరోసారి సెలవు తీసుకునే అవకాశం కల్పిస్తారా? ఇతరత్రా ప్రయోజనాలు ఉంటాయా..? అనేది యాజమాన్యం స్పష్టం చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి.

ముదిరాజ్‌లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- మెపా రాష్ట్ర కమిటీ తీర్మానం



సమావేశంలో పాల్గొన్న శ్రీనివాస్, నాయకులు

హన్మకొండ : ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, రిజర్వేషన్ అంశంపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ కోరారు. శనివారం హనుమకొండలో అసోషియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో ప్రత్యేక కోటా ఇచ్చి, ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాల్లో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం మెపా జెండాలు, కండువాలు ఆవిష్కరించారు. కండువాలు అందించిన బయ్య అశోక్, రొయ్యల రాధాకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ కట్ల శ్రీనివాస్, గుండ్ర చంద్రశేఖర్, పెండెం మధుసూదన్, రేగుల మొగిలి, వేణుమాధవ్, భిక్షపతి, కసుపు వెంకటరమణ, గూళ్ల సత్తయ్య, బోనాల రమేష్, పోతిరెడ్డి సత్తయ్య, చొప్పరి శ్రీనివాస్, పోలు పరమేష్, అశోక్, శ్యాం పాల్గొన్నారు.

అన్ని విధాలా ఆదుకుంటాం..
- వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో ప్రాథమికంగా రూ.414 కోట్ల నష్టం
- నష్టం అంచనా వేశాం.. త్వరలో పరిహారం
- రాజకీయాలకు ఇది సమయం కాదు
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- వివరాలు 8లో▸

వరద బాధితులను ఆదుకోవాలి

- లేదంటే ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట చావుడప్పు కొడతాం
- హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా : ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థతోనే వరంగల్ మహానగరం వరద ముంపునకు గురైందని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ సర్కారు, అధికారులపై మండిపడ్డారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అవగాహన రాహిత్యంతోనే హనుమకొండకు ఈ దుస్థితి వచ్చిందన్నారు. నాలాలపై అక్రమ నిర్మాణాలను పరోక్షంగా ప్రోత్సహించడమే కాకుండా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడంలో బీఆర్ఎస్ సర్కారు పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. అభివృద్ధి నిధులున్నా సద్వినియోగం చేసుకోలేని దద్దమ్మలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలని అన్నారు. ఏళ్లు గడుస్తున్నా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని వినయ్‌భాస్కర్ పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. వరద బాధితులకు రూ.10 వేల ఆర్థిక సాయం ఇంతవరకు చేయలేదన్నారు.మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే ఇళ్ల ఎదుట చావుడప్పు కొడతామని హెచ్చరించారు. టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, కూచన రవళి, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, నాయకులు పులి అనిల్, బంక సరళ, డాక్టర్ పి.రామకృష్ణ, వెంకట్, రాహుల్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులవి మాయమాటలు
రామన్నపేట : మాయమాటలతో బీఆర్ఎస్ నాయకులు పబ్బం గడుపుకుంటున్నారని నాయిని రాజేందర్‌రెడ్డి మండిపడ్డారు. భద్రకాళి చెరువు గండితోపాటు ముంపు ప్రాంతాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసిన అభివృద్ధి ఏమిటో చూపిస్తా అన్నావు.. కదా ఇదా నువ్వు చేసిన అభివృద్ధి అంటూ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు కూచన రవళి, ఎంబాడి రవీందర్, బంక సరళ పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది అప్రమత్తం

- ప్రత్యేక శిబిరాలు, ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ఏర్పాటు
- సెలవులు రద్దు.. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- అన్ని ఆస్పత్రుల్లో పాము, తేలు కాటుకు మందులు
- 'సాక్షి'తో డీఎంహెచ్ఓ సాంబశివరావు



సాంబశివరావు, డీఎంహెచ్ఓ

ఎంజీఎం : భారీ వర్షాలకు ముంపు ప్రాంతాల ప్రజలు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని డీఎంహెచ్ఓ సాంబశివరావు అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని వివరించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం వైద్య, ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యల వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి 'సాక్షి'కి వివరించారు.

వైద్యులు, సిబ్బంది సెలవులు రద్దు..
రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమయపాలన పాటించని వైద్యులకు మెమోలు జారీ చేయడంతోపాటు వైద్యులు, సిబ్బంది సెలవులను రద్దు చేశాం. ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు కలెక్టర్ అదేశాల మేరకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీంను సైతం ఏర్పాటు చేశాం. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

సమన్వయంతో ముందుకు..
వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం, పరిసరాల పరిశుభ్రత లోపించడంతో వివిధ రకాల వ్యాధులు సంక్రమిస్తాయి. మెరుగైన పారిశుద్ధ్యం కోసం పలు ప్రభుత్వ శాఖల సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. ఇందుకోసం కలెక్టర్ శనివారం ఆరోగ్య శాఖ, సంబంధిత శాఖలతో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు.

వారానికోరోజు డ్రైడే పాటించాలి..
దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా చూడాలి, గుంతలను మట్టితో పూడ్చివేయాలి, పనికిరాని కూలర్లు, పాత డ్రమ్ములు, సీసాలు లేకుండా చూసుకోవాలి. మెరుగైన పారిశుద్ధ్యం కోసం ప్రజలు సహకరించాలి. నీరు నిల్వ ఉన్న గుంతల్లో క్రిమిసంహారక మందులు, కిరోసిన్, ఇంజిన్ ఆయిల్‌లో ముంచిన గుడ్డలు వేయాలి. వారానికి ఒక రోజు డ్రైడేగా పాటించి ఇళ్లలోని వంట పాత్రలు, డ్రమ్ములను ఆరబెట్టాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి, భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి. వేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలి.

ప్రోగ్రామింగ్ అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ
జిల్లాలోని 17 పీహెచ్‌సీలు, 7 యూపీహెచ్‌సీలతో పాటు పలు ఆస్పత్రులను ప్రోగ్రామింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వైద్య సిబ్బంది హాజరు, రోగుల తాకిడి, ప్రత్యేక వైద్యశిబిరాల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాము, తేలు కాటుకు మందులు అందుబాటులో ఉన్నాయి. విషజ్వరాలతో బాధపడే వారిని ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేసి, మెరుగైన వైద్యసేవలు అందేలా ఎంజీఎం అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం.

క్లుప్తంగా

పలు రైళ్లు రద్దు

● జూలై 31 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు..



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ సబ్ డివిజన్ పరిధిలో రైల్వే ట్రాక్ నిర్వహణతో పాటు మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల నేపథ్యంలో పలు ప్యాసింజర్ రైళ్లను జూలై 31 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ఈ మేరకు కాజీపేట రైల్వే అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం విచారణ కౌంటర్ వద్ద రైళ్ల రద్దు బోర్డును డిస్‌ప్లే చేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు

కాజీపేట–డోర్నకల్ ప్యాసింజర్ (07753), డోర్నకల్–కాజీపేట (07754) ప్యాసింజర్, సికింద్రాబాద్–వరంగల్ (07462) పుష్‌పుల్, వరంగల్–సికింద్రాబాద్ (07463) పుష్‌పుల్, కాజీపేట–సిర్పూర్ (17003) సింగరేణి, సిర్పూర్ –కాజీపేట (17004) సింగరేణి, కాజీపేట–బల్లార్షా (17035), బల్లార్షా –కాజీపేట (17036), భద్రాచలంరోడ్–బల్లార్షా (17033), బల్లార్షా–భద్రాచలంరోడ్ (17034) సింగరేణి రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

● పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 30 ,31 ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ, ఫార్మడీ, బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ సెమిస్టర్ పరీక్షలు, పీజీ కోర్సులకు సంబంధించి నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలు, లా ఫైనల్ విద్యార్థులకు మూట్‌కోర్టు పరీక్షలు వాయిదా వేసినట్లు వివరించారు. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేశామన్నారు. వాయిదాపడిన పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

సర్వస్వం పోయింది.. ఆదుకోండి..

● ఆపన్నహస్తం కోసం మోరంచపల్లి వాసుల ఎదురుచూపు
● ముందుకు వస్తున్న నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు
● నిత్యావసరాలు పంపిణీ చేయని అధికారులు
● నష్టపరిహారం అందించాలని వేడుకుంటున్న బాధితులు

కన్నీటి గాథ





తడిసిన పాడైన సూపర్‌మార్కెట్ సామగ్రి

భూపాలపల్లి అర్బన్/భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి గ్రామస్తులు వరద ఉధృతిలో సర్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. వరదలో నిత్యావసరాలు, వాహనాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను కోల్పోయారు. కట్టుకోవడానికి బట్టలు.. కప్పుకోవడానికి దుప్పటి కుడా లేని దుస్థితి నెలకొంది. వరదల నుంచి తేరుకొని మూడు రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో నష్టపరిహారం ఇస్తుందా లేదా అని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఆపన్నహస్తాల కోసం ఎదురు చుస్తున్నారు. గ్రామంలో ఏ ఒక్కరిని కదిలించినా క'న్నీరే' ఉబికి వస్తోంది. కాగా, నిత్యావసర వస్తులు అందించేందుకు పలువురు ముందుకు వస్తున్నారు.

ప్రభుత్వం నుంచి అందని తక్షణ సాయం

ఊరికి ఊరంత వరదలో మునగడంతో కట్టుబట్టలతో బయటికి వచ్చిన బాధితులకు ప్రభుత్వం నుంచి కనీసం తక్షణ సాయం కూడా అందలేదు. నిత్యావసర వస్తువులు, బియ్యం కూడా పంపిణీ చేయలేదు. నష్టపోయిన ఆస్తికి, పశువులకు పరిహారం కింద ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

వరదల్లో కొట్టుకుపోయిన చెంచు కాలనీ

10 ఇళ్లు వరద తాకిడి దెబ్బతినగా చెంచుకాలనీకి చెందిన 18 గుడిసెలు వరదలో కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కొక్క ఇంటిలో రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోరంచపల్లి బస్టాండ్ సమీపంలోని సంతోషిమాత సూపర్‌మార్కెట్‌లో రూ. 20లక్షల విలువైన కిరాణా సామగ్రి తడిసి పాడైంది.

ముందుకు వస్తున్న పలువురు..

మోరంచపల్లిలో జరిగిన నష్టాన్ని చూసిన పలువురు చలించిపోతున్నారు. పగవారికి కూడా ఇలాంటి కష్టం రావొద్దని వేడుకుంటున్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల నాయకులు ముందుకు వచ్చి బియ్యం, కూరగాయలు, వంట సామాను, చద్దర్లు, మ్యాట్లు, పండ్లు, పప్పులు, చీరలు, ఇతర వస్తువులు ఇంటింటికీ తిరుగుతూ బాధితులకు అందజేస్తున్నారు.

రూ.20 లక్షల నష్టం జరిగింది



మోరంచపల్లిలో వచ్చిన వరదతో మా సూపర్‌మార్కెట్‌లో రూ.20లక్షల విలువైన వస్తువులు తడిసి పాడయ్యాయి. చక్కెర, పప్పు, పిండి, బియ్యం ఇతర వస్తువులు పాడయ్యాయి. అప్పు తెచ్చి షాపు ఏర్పాటు చేసుకున్న. వస్తువులు కొనుగోలు చేసిన సెట్లకు ఇంకా డబ్బు ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

–దొడ్డశాని సంతోష్, సూపర్ మార్కెట్ నిర్వాహకుడు

ఇంటికి రూ. 4లక్షలు ఇవ్వాలి



వరద ఉధృతిలో సర్వం కోల్పోయాం. ప్రతి ఇంటికీ ప్రభుత్వం రూ.4లక్షలు ఇచ్చి ఆదుకోవాలి. వరదలో 3 తులాల బంగారం, రూ.15వేల నగదు, వంట గ్యాస్, భూమి పాస్‌పుస్తకాలు, ఇతర వస్తువులు కొట్టుకుపోయాయి. మిగిలిన వస్తువులను కడుకుంటున్నాం. ఇప్పటికీ ఒక్క అధికారి కూడా వచ్చి నష్టం గురించి సర్వే చేయలేదు.

–సూరం రాజయ్య, వరద బాధితుడు

రూ.3 లక్షల నష్టం జరిగింది



వరద కారణంగా కొన్ని వస్తువులు తడిశాయి. మరి కొన్ని వస్తువులు కొట్టుకుపోయాయి. రూ.లక్ష విలువైన బండి కొట్టుకుపోయింది. ఫ్రిడ్జి, కూలర్, బట్టలు, ఇతర వస్తువులు తడిశాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తి వరకు నష్టం జరిగింది. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

–కోటగిరి తిరుమల, మోరంచపల్లి వరద బాధితురాలు

గ్రామాన్ని తరలించాలి..



2001లో గ్రామానికి భారీ స్థాయిలో వరదలు వచ్చాయి. అప్పుడే గ్రామాన్ని తరలించాలని వేడుకున్నాం. అయినా అధికారులు పట్టించుకోలేదు. మూడు రోజుల క్రితం వచ్చిన వరదలకు గ్రామంలో నలుగురు కొట్టుకుపోయారు. గ్రామస్తులమందరం సర్వం కోల్పోయి కట్టుబట్టలతో పునరావాస కేంద్రాల్లో ఉంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం మోరంచపల్లి గ్రామాన్ని తరలించాలి.

–కర్ర పుష్పలీల, మోరంచపల్లి వరద బాధితురాలు

అన్ని విధాలా ఆదుకుంటాం

● బాధితులకు ప్రభుత్వం అండ
● నష్టం అంచనా వేశాం.. త్వరలో పరిహారం
● రాజకీయాలకు ఇది సమయం కాదు
● రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

హన్మకొండ అర్బన్ : వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఊహించని విధంగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో ప్రాథమికంగా రూ.414 కోట్లు నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. ఇందులో వరంగల్ జిల్లాలో రూ.89 కోట్లు, హనుమకొండలో రూ.146 కోట్లు, గ్రేటర్ పరిధిలో రూ.179 కోట్లు అంచనా వేశామన్నారు. 36 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 4668 మంది బాధితులను తరలించామన్నారు. గ్రేటర్ పరిధిలో 38 రెస్క్యూ టీమ్‌ల ద్వారా 2,055 మందిని రక్షించామని తెలిపారు. 207 ఇళ్లు పూర్తిగా, 480 ఇండ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. త్వరలో పరిహారం అందజేస్తామని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ముందు చూపుతో ప్రమాదం తప్పిందన్నారు. భద్రకాళి చెరువుకు గండి పండిదనే విషయం తెలుసుకున్న అధికారులు.. ప్రాణహాని కలుగకుండా వెంటనే చర్యలు చేట్టారన్నారు. వరద బాధితులకు సహకారం అందజేస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్‌లో ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు 14 సెంటీ మీటర్లు వర్షపాతం నమోదైందన్నారు. 154 ప్రాంతాలు జలమయయ్యాయని తెలిపారు. బీటీ రోడ్లు 38 కిలో మీటర్లు, సీసీ రోడ్లు 43 కిలోమీటర్లు, మెటల్ రోడ్లు 95 కిలో మీటర్లు ధ్వంసమయ్యాయన్నారు. వర్షాలకు వరంగల్‌లో ఒకరు, హనుమకొండలో ఆరుగురు మృతి చెందారన్నారు. హనుమకొండలో 4137 చెరువులు దెబ్బతిన్నాయన్నారు. ఆర్‌అండ్‌బీకి సంబంధించి వరంగల్‌లో 22 కిలోమీటర్లు, హనుకొండలో 22 కిలోమీటర్లు ధ్వంసమయ్యాయన్నారు. పంట నష్టం కూడా అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి పంపామని తెలిపారు. ఈ సమయంలో ప్రతిపక్షాలు రాజకీయం చేస్తూ ప్రజలను రెచ్చగొట్టొద్దని, సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. భద్రకాళి చెరువు మరమ్మతులు వెంటనే చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అస్వస్థత





చికిత్స పొందుతున్న మీనాక్షి, రుత్విక

గూడూరు: మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బా విద్యాలయంలో శుక్రవారం రాత్రి ఇద్దరు బాలికలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. ఊట్లకు చెందిన బానోతు మీనాక్షి ఇంటర్ మొదటి సంవత్సరం, బ్రాహ్మణపల్లికి చెందిన మేరుగు రుత్విక అదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఇద్దరు కొంత కాలంగా శ్వాస కోశ ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో బాలికలు శ్వాసకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గుర్తించిన ఉపాధ్యాయులు వెంటనే గూడూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం వైద్యుడి సూచన మేరకు మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం బాలికలు ఆరోగ్యంగా ఉన్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరం

● టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



తడిసిన రికార్డులను పరిశీలిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, విద్యుత్ ఉద్యోగులు నిరంతరాయంగా పని చేస్తున్నారని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. శనివారం వరంగల్ బొంది వాగులో కూలిన 33 కేవీ లైన్ విద్యుత్ టవర్‌ను పరిశీలించారు. అనంతరం వరంగల్ పోతన నగర్‌లో నీటి మునిగిన విద్యుత్ ఈఆర్ కార్యాలయాన్ని సందర్శించారు. తడిచిన రికార్డులు పరిశీలించారు. రికార్డులు తడి ఆరబెట్టి భద్రపరచాలని సూచించారు. అదే విధంగా వరద ఉధృతి తగ్గిన తర్వాత బొంది వాగులో కూలిన టవర్ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని చోట్ల విద్యుత్ సరఫరా అందించగలిగామని, 24/7 ఉద్యోగులందరూ ఫీల్డ్‌లో ఉంటూ పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లిఖార్జున్, డీఈ(టెక్నికల్) అనిల్ కుమార్, ఏడీఈ పి.శ్రీనివాస రెడ్డి, ఏఈ మహేందర్ పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో కిషన్ రెడ్డి పర్యటన



గండిని పరిశీలిస్తున్న రావు పద్మ

హన్మకొండ : కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆదివారం హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకుని, అక్కడి నుంచి భూపాలపల్లి జిల్లాకు చేరుకుంటారని వివరించారు. జనగామలో ఉదయం 9.30 గంటలకు అల్పాహారం చేసి అక్కడి నుంచి 10 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 12 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లికి చేరుకుంటారన్నారు. మోరంచపల్లిలో గంట పర్యటిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు రేగొండకు చేరుకుని మధ్యాహ్నం భోజనం చేస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 3.30 గంటలకు నగరానికి చేరుకుని హనుమకొండ, వరంగల్‌లో వరద ప్రభావిత ముంపు ప్రాంతాలను సందర్శిస్తారు.

భద్రకాళి చెరువును పరిశీలించిన రావు పద్మ

వరంగల్ పోతన నగర్ వద్ద భద్రకాళి చెరువుకు పండిన గండిని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పరిశీలించారు. ఆమె వెంట నాయకులు ప్రితీష్, ఆకాష్ ఠాకుర్, నదియా, నరేష్, పవన్, గౌతం, వినీత్ ఉన్నారు.

కాలేజీ యాజమాన్యం పరీక్ష ఫీజు తీసుకోవడం లేదని..

● విద్యార్థి ఆత్మహత్య

హసన్‌పర్తి: కాలేజీ యాజమాన్యం పరీక్ష ఫీజు తీసుకోవడం లేదని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా 56వ డివిజన్ పరిమళ కాలనీలో శుక్రవారం రాత్రి జరిగింది. మృతుడి తండ్రి శనివారం కేయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాలనీకి చెందిన కందకట్ల జనార్దన్ కుమారుడు గౌతం (21) నగరంలోని వాగ్దేవి కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నాడు. హాజరు నమోదు తక్కువగా ఉండడంతో ఎగ్జామ్స్ ఫీజు తీసుకోవడానికి యాజమాన్యం నిరాకరించింది. దీంతో మనోవేదనకు గురైన గౌతం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి తండ్రి జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

పలువురి గల్లంతు.. మృతదేహాలు లభ్యం

భారీ వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలుచోట్ల గల్లంతైన పలువురి మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.



లక్ష్మి(ఫైల్)

వెంకటాపురం(ఎం): మండలంలోని నల్లగుంట పరిధి బిలుగుకుంటలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. నల్లగుంట గ్రామానికి చెందిన సాద లక్ష్మి గత గురువారం బిలుగుకుంట వైపు వెళ్లి కాలువలో పడి వరదలో కొట్టుకుపోయింది. కాగా, మూడు రోజులుగా కుటుంబ సభ్యులు.. లక్ష్మి ఆచూకీ కోసం పలుచోట్ల వెతికారు. అయినా ఫలితం కనిపించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శనివారం ఉదయం నీటి వనరుల్లో వెతకగా బిలుగుకుంటలో లక్ష్మి మృతదేహం కనిపించింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వెంకటాపురం ఎస్సై తాజుద్దీన్ తెలిపారు.

నడికూడలో గుర్తుతెలియని మహిళ మృతదేహం..

నడికూడ: మండల కేంద్రంలోని పెద్ద చెరువు పక్కన గల చింతలపల్లి భీమ్‌రావు పొలంలోకి శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం వరదకు కొట్టుకొచ్చింది. దీనిని చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. కేవలం అస్థిపంజరంతో ఉన్న మృతదేహాన్ని సీఐ వెంకట్ రత్నం, ఎస్సై శివకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ వరుణ్ పంచనామా నిర్వహించి ఖననం చేశారు. అనంతరం వీఆర్‌ఏ అంబి వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల ఎస్సై శివకృష్ణ తెలిపారు.


జంపన్నవాగులో వ్యక్తి మృతదేహం..

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని గోనెపల్లి గొత్తికోయ గూడేనికి చెందిన నందయ్య (50) మృతదేహం లభ్యమైంది. మేడారం జంపన్నవాగు సమీపంలోని మామిడి తోటకు కాపాలా ఉంటున్న ఆయన.. గురువారం జంపన్నవాగు వరదలో గల్లంతయ్యాడు. వరద తగ్గడంతో వాగు పక్కన ఇసుకలో శనివారం నందయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహం బయటకు తీసి పంచనామా నిర్వహించారు.

ప్రతికూల పరిస్థితుల్లో..

సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

● తొలి దశలో మొక్కల సాంద్రత కాపాడుకోవాలి
● పంటలో నీరు నిల్వ లేకుండా చూడాలి
● కేవీకే శాస్త్రవేత్త రాజు





డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

కరీమాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వివిధ పంటలు నీట మునుగుతున్నాయి. కొన్ని చోట్ల మొక్కలు ఎర్రబారుతున్నాయి. ఫలితంగా లక్షలాది రూపాయల పెట్టుబడి నీటిపాలు అవుతోంది. దీంతో రైతులు ఘొల్లుమంటున్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల్లో పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాజు అన్నారు. తొలి దశలో మొక్కల సాంద్రత కాపాడుకుని తర్వాత దశల్లో దిగుబడి తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతుల గురించి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పత్తి..



వర్షాభావ పరిస్థితులతో పత్తి మొక్కలు సుమారు 30 రోజుల దశలో ఉన్నాయి. వర్షపు నీరు నిలిస్తే ఆకులు ఎర్రగా మారి చనిపోతాయి. ఈ నేపథ్యంలో నీటిని బయటకు పంపి ఎకరాకు 25–30 కిలోల యూరియా, 10–15 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌ను వేయాలి. వర్షం తగ్గిన అనంతరం అవసరం మేరకు పొటాషియం నైట్రేట్ 2 శాతం 20 గ్రాములు నీటిలో కలిపి పది రోజులలో రెండు సార్లు పిచికారీ చేయాలి. మొక్కలు వాలిపోతే కాపర్ ఆక్సీక్లోరైడ్ నీటిలో కలిపి మొక్కల దగ్గర పోయాలి. మొక్క నీరసంగా ఉంటే 13–0–45ను నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ క్రమంలోనే 19–19–19, మల్టి–కె లాంటివి పిచికారీ చేయాలి.

వరి..



నారుమడుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. చిన్నమొలకలు అధిక నీటిని తట్టుకోలేవు. ఈ నేపథ్యలో వెదజల్లే పద్ధతిలో విత్తుకున్న రైతులు పొలాల్లో, మడులలో నిలిచిన నీటిని తొలగించాలి. వర్షాలు తగ్గాక నారు ఎర్రబడే అవకాశముంది. మడిలో మోతాదు ప్రకారం యూరియా వేయాలి. కార్బన్డిజం, మ్యాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. నారు కొనలు ఎర్రగా మారితే జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలి. ఇక నాటు వేసిన రైతులు వరద ఉధృతి తగ్గగానే యూరియా వేయాలి. అవసరం మేరకు జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలి.



మొక్కజొన్న..

మొక్కజొన్నలో అధిక తేమతో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలు ఊద రంగులోకి మారే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఏపీ, 19–19–19 లాంటి యూరియాను వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి. వర్షాలు ఆగిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

కంది..

అధిక తేమతో మొక్కలలో ఇనుము లోపంతో ఆకులు పసుపు రంగులోకి మారి ఎండి రాలిపోయే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో నివారణకు అన్నభేది, నిమ్మ ఉప్పు కలిపి పైరుపై వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వర్షం తగ్గిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

మిరప..



మిరప పంట ప్రస్తుతం నారు మడి దశలో ఉంది. ఈ నేపథ్యంలో రైతులు నీరు పోవడానికి కాలువలు చేసి ఉంచాలి. నారుమడిని పాలిథిన్ షీట్‌తో గాని, వరి గడ్డితో గాని వర్షం తగ్గే వరకు కప్పి ఉంచాలి. వర్షం తగ్గాక వేరు కుళ్లు తెగులు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ మోతాదు ప్రకారం నీటిలో కలిపి మొదళ్ల దగ్గర పోయాలి.